కోటి ఎకరాలకు రైతుబంధు కోత!

- సీజన్ ఏదైనా పంట వేస్తేనే సాయం
- అదీ పంటలు నిర్ధారణ అయ్యాకే..
- పంట వేయకపోతే రైతుబంధు బంద్
- నీళ్లులేక పంట వేయకపోయినా కట్
- రిమోట్ సెన్సింగ్ ద్వారా పంటల సర్వే
- విధివిధానాల రెడీలో వ్యవసాయశాఖ
- అన్నదాతపై కత్తిగట్టిన రాష్ట్రప్రభుత్వం
- రైతుబంధు పెట్టింది ఎందుకు?

పంటల సాగుకు రైతులు అప్పులు చేయొద్దన్న సంకల్పంతో కేసీఆర్ సర్కారు రైతుబంధును ప్రవేశపెట్టింది. సాగుకు ముందే పెట్టుబడి సాయం అందిస్తే రైతులకు ఉపయోగపడుతుందన్నది ముఖ్య ఉద్దేశం. ఏటా వానకాలం, యాసంగి.. రెండు పంటలకు కలిపి ఎకరాకు రూ.10 వేల సాయం అందించింది.

కాంగ్రెస్ సర్కారు చేయబోయేదేమిటి?

పంట సాగు చేసిన భూమికే రైతుబంధు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటున్నది. అంటే.. సాగు సమయానికి రైతుకు పెట్టుబడి సాయం అందదు. రైతు పంట సాగు చేసి, సర్వే పూర్తయ్యాకే సాయం అందుతుంది. అంటే ఇది పెట్టుబడి సాయం కాబోదు. ఇదే జరిగితే రైతులకు దీని వల్ల ఏం లాభం? అనేదే ప్రశ్న. సాగుకు ముందు పెట్టుబడి సాయం ఇచ్చి రైతులను ఆదుకోవాలి కానీ, రైతులే పెట్టుబడి పెట్టుకొని పంటలు సాగు చేశాక ఇవ్వటం ఏమిటి? అన్నది మరో ప్రశ్న.

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): వానకాలంలో మంచి వానలు పడి పంట వేస్తే.. సరి! వానలు పడలేదని, నీళ్లు లేవని పంట వేయకుండా ఉంటారో.. ఆ సీజన్‌కు రైతుబంధు చిల్లిగవ్వ కూడా ఇచ్చేదే లేదు. యాసంగిలోనూ అంతే.. పంట వేస్తేనే రైతు చేతికి రైతుబంధు. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా విధించబోతున్న ఆంక్ష. మొన్నటిదాకా చెట్లు, గుట్టలకు రైతుబంధు ఇవ్వబోమని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ఏకంగా సాగు భూములకూ పెట్టుబడి సాయం ఎగబెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నది. ఇప్పటి వరకు వానకాలంలో పంట సాగు చేసి, యాసంగిలో సాగు చేయకపోయినా రైతులకు ఉన్న మొత్తం భూమికి పెట్టుబడి సాయం అందేది. కానీ ఈ వానకాలం సీజన్ నుంచి మొత్తం భూమికి రైతుబంధు రావటం కష్టమే. ఎందుకంటే.. రైతులకు పెట్టుబడి సాయంపై ఆంక్షలకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఇకపై పంట సాగే ప్రామాణికంగా రైతులకు సాయం అందించనున్నది. అంటే.. సీజన్ ఏదైనా రైతు పంట సాగు చేసిన భూమికే రైతుబంధు ఇవ్వనున్నది. ఇందుకోసం రిమోట్ సెన్సింగ్‌తో పాటు ఇతర టెక్నాలజీలతో పంట సాగు చేసిన భూమిని లెక్కించనున్నది. ఈ సర్వేలో రైతు పంట సాగు చేసినట్టు చూపితేనే ఆ రైతుకు పెట్టుబడి సాయం అందుతుంది. లేదంటే అంతే సంగతి.

యాసంగిలో రైతు చేతికి సున్నం

రైతులు అన్ని సీజన్లలో తమకున్న మొత్తం భూమిలో పంటలు సాగు చేయరు. వానకాలంలో ఎక్కువ భూమిలో సాగు చేస్తే, యాసంగిలో సగం భూమిలోనే సాగు చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతుబంధు పంపిణీలో చేయబోయే మార్పులతో ఇకపై యాసంగిలో రైతుబంధు రావటం గగనం కానున్నది. ప్రతి రైతుకు ఇప్పుడొస్తున్న రైతుబంధులో సగం మేర కోత పడనున్నది. ఉదాహరణకు.. వానకాలంలో 1.26 కోట్ల ఎకరాల్లో పంటలు సాగై, యాసంగిలో 66 లక్షల ఎకరాలకే పరిమితమైతే.. అంతే మొత్తానికి రైతుబంధు అందుతుంది. అంటే రైతులకు వానకాలంలో 1.26 కోట్ల ఎకరాలకు జమైతే, యాసంగికి వచ్చేసరికి 66 లక్షల ఎకరాలకే పెట్టుబడి సాయం వస్తుంది. ఈ లెక్కన యాసంగిలో 60 లక్షల ఎకరాలకు రైతుబంధు కోత పడనున్నది. అంటే సగం భూమికి రైతుబంధు రాదన్నట్టే.

కోటి ఎకరాలకుపైగా కోత

రైతుబంధులో కాంగ్రెస్ సర్కారు చేస్తున్న ఈ మార్పులతో ఏటా కోటి ఎకరాలకు పెట్టుబడి సాయం కోత పడనున్నది. గత ఏడాది వానకాలంలో కేసీఆర్ సర్కారు 1.52 కోట్ల ఎకరాలకు సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ లెక్కన యాసంగిలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం అంతే మొత్తానికి రైతుబంధు ఇవ్వాలి. ఈ నేపథ్యంలో మొత్తం ఏడాదికి రెండు సీజన్లు కలిపి 3.04 కోట్ల ఎకరాలకు రైతుబంధు అందాలి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం పంట సాగు చేసిన భూములకే రైతుబంధు ఇవ్వాలని నిర్ణయించటంతో కోత పడనున్నది. గత ఏడాది వానకాలంలో 1.26 కోట్ల ఎకరాల్లో పంటలు సాగైతే, యాసంగిలో 66 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. రెండు సీజన్లలో కలిపి 1.92 కోట్ల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే 3.04 కోట్ల ఎకరాలకు రావాల్సిన రైతుబంధు.. 1.92 కోట్ల ఎకరాలకే వస్తుంది. అంటే 1.12 కోట్ల ఎకరాలకు సాయం అందదు. సాగు విస్తీర్ణం తగ్గితే, పెట్టుబడి సాయం కూడా మరింత తగ్గుతుంది. తద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందకుండా పోతుందన్న ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

రిమోట్ సెన్సింగ్‌తో పంటల సర్వే

పంట సాగుకు, పెట్టుబడి సాయానికి లింకుపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు సంబంధించి పంట సాగు లెక్కల్ని పక్కాగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఏ సర్వే నంబర్‌లో ఎంత పంట సాగైందనే లెక్కల్ని తీసేందుకు రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీని వినియోగించనున్నది. ఈ టెక్నాలజీ ద్వారా ప్రతి గ్రామంలో, ప్రతి సర్వే నంబర్‌లో ఎంత భూమి సాగైందో లెక్కించనున్నది. ఆ తర్వాత ఏఈవోలతోనూ పంట విస్తీర్ణాన్ని లెక్కిస్తుంది. ఈరెండింటిని పెట్టుబడి సాయానికి లింక్ చేసి, ఎంత భూమి సాగు చేశారో లెక్కించనున్నది.

పంట సాగు తర్వాతే సాయం

సాగుకు ముందు పెట్టుబడి సాయం అందించి, రైతులను అప్పుల బారి నుంచి కాపాడాలన్న ఉద్దేశంతో రైతుబంధును కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంతో రైతుబంధు ముఖ్య ఉద్దేశమే దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. ఎందుకంటే.. రైతు పంట వేసి, సర్వే పూర్తయ్యాకే సాయం అందించనున్నది. ఇదే జరిగితే రైతులకు మళ్లీ పెట్టుబడి కష్టాలు మొదలవుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్నేండ్లు సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందటంతో రైతులు రంది లేకుండా ఉండేవారు. కానీ, మళ్లీ పెట్టుబడి సాయం కోసం ప్రైవేటు వ్యాపారులు, గ్రామాల్లోని షావుకార్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్న ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

భారం భరించలేకే కోతలా?

రైతుబంధు సాయాన్ని రైతుభరోసా పేరుతో అమలు చేసి ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ భారాన్ని తప్పించుకొనేందుకు కోతలు పెడుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.10 వేల చొప్పున పంపిణీకి రూ.15-16 వేల కోట్లు అవసరం అయ్యేవి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలంటే ఏటా 1.52 కోట్ల ఎకరాలకు రూ.22,800 కోట్లు అవసరం అవుతాయి. ఈ నేపథ్యంలో ఈ ఆర్థిక భారాన్ని తప్పించుకునేందుకే రైతుబంధులో కోతకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లోకం పోకడ

గాంధీ భవన్‌ని గాంధీ ఆసుపత్రికి తరలిస్తే సరి!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	46.0°c	25.8°c
మహబూబ్‌నగర్	45.5°c	30.7°c
రంగారెడ్డి	45.5°c	24.4°c
నిజామాబాద్	44.5°c	30.5°c
నల్లగొండ	43.4°c	29.9°c
మెదక్	42.8°c	22.0°c
ఖమ్మం	38.0°c	29.0°c
వరంగల్	38.0°c	27.0°c
హైదరాబాద్	38.0°c	26.0°c
కరీంనగర్	37.0°c	27.0°c

మేం బూతులు మాట్లాడుతం

మొదటిపేజీ తరువాయి...

ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి బూతులు మాట్లాడటంపై విలేకరి ప్రశ్నించగా.. బూతులు మాట్లాడటం తప్పేకాదని, రాజకీయాల్లో ఉన్నవాళ్లు అలాగే మాట్లాడుతారని చెప్పారు. అన్‌పార్లమెంటరీ భాషను ఉపయోగించడం తమ తప్పుకాదని, వాటిని ప్రసారం చేసేవారిదే తప్పని అంటూ.. అలా ప్రసారం చేసే ఒకరిద్దరు పాత్రికేయులను జైల్లో వేస్తే ఇలాంటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

తెలంగాణలో ఒకరకమైన భాషను ఒకప్పుడు అసహ్యించుకున్నారు. ఆ భాషను వద్దనుకున్నారు. మీరేమో ఒకరిని చీర కట్టుకొని రండి అని అంటే.. ఆయనేమో మీరు, రాహుల్ గాంధీలే చీర కట్టుకొని రావాలంటున్నారు. డ్రాయర్, బనీన్, లంగాల గురించి మాట్లాడుతున్నారు. తెలంగాణ ప్రజలకు ఈ భాష నుంచి విముక్తి ఉందా?

అసలు సమస్య మీతోనే ఉన్నది. మీలో ఒకరిద్దరిని జైలుకు తోలితే కానీ సమస్య పరిష్కారం అయ్యేలా లేదు. ఇలా మాట్లాడంగానే వాటిని వేయవద్దు. మాట్లాడేవారిని చూపించవద్దు. మీపై సోషల్ రెస్పాన్సిబిలిటీ ఎక్కువ ఉంటుంది. మాకు పొలిటికల్ యాంబిషన్ ఉంటుంది. మీరున్నది ఫోర్త్ ఎస్టేట్‌లో.. సామాజిక బాధ్యత వంద శాతం అమలు చేయాల్సింది మీరు. అట్లా మాట్లాడేవారి ప్రసంగాలను మీరు నిషేధించాలి.. నియంత్రించాలి. అప్పుడే సమాజానికి వారి బాధ తప్పుతుంది.

శిష్యుడి కోసం చంద్రబాబు తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పోటీచేయకుండా సహకరించాడు. మరి గురువు అక్కడ పోటీచేస్తున్నాడు. శిష్యుడి సహకారం ఎలా ఉంది..?

ఎవడయ్యా బుర్రలేనోడు మాట్లాడేది. గురువెవ్వరు..? శిష్యుడెవ్వరు..? నేను ఆయనకు సహచరుడినని చెప్తున్న. బుద్ధిలేని గాడిదకొడుకు గురువు, శిష్యుడు అని మాట్లాడితే బుడ్డి మీద తంతా.. చంద్రబాబు పార్టీ అధ్యక్షుడు. నేను ఇం డిపెండెంట్ ఎమ్మెల్సీగా గెలిచి తెలుగుదేశంలో చేరిన. నేను సహచరుడిని.

ఈ నెల ఆర్టీసీలో జీతాలు రాలేదంట?

జీతాలు వచ్చాయా లేదా అని కాదు.. ప్రభుత్వం వాడుకునే ప్రతి పైసా.. ప్రతి నెల రూ.350 కోట్లు ఆర్టీసికి చెల్లించాం. ఇప్పటివరకు 1369 కోట్లు చెల్లించాం. ఆర్టీసీ వాళ్లు ఎన్నికలకోడ్ వల్ల జీతాలు ఇచ్చారా లేదా అన్నది ఎన్నికల సంఘం అధికారి వికాస్‌రాజ్ అని ఉంటాడు కదా.. ఆయనను అడిగితే మీకు సమాధానం వస్తుంది.

ఓట్ల పంటకే రైతుబంధు జాప్యం!

- పోలింగ్ దగ్గర పడ్డాకే ఖాతాల్లో జమ
- రాజకీయ ప్రయోజనాలకు రైతులు పణం
- ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న విమర్శలు

హైదరాబాద్, మే 7(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనం కన్నా రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాగు సమయంలో వేయాల్సిన రైతుబంధు పెట్టుబడి సాయాన్ని ఓట్ల సమయంలో వేయడం అందులో భాగమేనని చెప్తున్నారు. సాగు సమయంలో వేస్తే తమకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, అదే ఓట్ల సమయంలో వేస్తే లబ్ధిపొందవచ్చునన్న ఉద్దేశంతోనే రైతుబంధు సాయాన్ని ఇప్పుడు విడుదల చేసిందని విమర్శిస్తున్నారు. జనవరి, ఫిబ్రవరిలో పూర్తికావాల్సిన పంపిణీని కావాలని ఇప్పటి వరకు జాప్యం చేసిందని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఓవైపు కరువు, సాగు నీళ్లు లేకపోవడం, పంటలు ఎండిపోవడం, పండిన పంటలను కొనుగోలు చేయకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులకు పీకలదాకా కోపం ఉంది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైతే ఇబ్బంది తప్పదని భావించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 8నాటికి రైతుబంధు పంపిణీని పూర్తిచేస్తామని ప్రకటించారు.

అప్పుడు లేని డబ్బులు ఇప్పుడెలా?

యాసంగి రైతుబంధు పంపిణీని ప్రభుత్వం డిసెంబర్ 9న ప్రారంభించి మార్చి నెలాఖరు వరకు ఐదు కరాల రైతులకు పంపిణీ చేసి మిగతా వారికి నిలిపివేసింది. మరో రూ. 2,300 కోట్లు సమకూర్చితే మొత్తం పంపిణీ పూర్తయ్యేది. నిధుల కొరతను సాకుగా చూపి పంపిణీ నిలిపివేసింది. మరో వారం రోజుల్లో ఎన్నికలు ఉండడంతో మిగతా రైతులకు రైతుబంధు నిధులు విడుదల చేసింది. అప్పుడు లేని డబ్బులు ఇప్పుడెలా వచ్చాయన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రైతుల ఓట్లు దండుకునేందుకే ప్రభుత్వం ఈ డ్రామా ఆడిందని విమర్శిస్తున్నారు.

అప్పుడు బీఆర్ఎస్‌ను అడ్డుకొని

సాగు పెట్టుబడికి ఇబ్బంది రావొద్దనే ఉద్దేశంతో యాసంగి పెట్టుబడి సాయాన్ని సకాలంలో అందించాలని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. అప్పుడు ఎన్నికల కోడ్ ఉందంటూ ఇదే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి మరీ రైతులకు పెట్టుబడి సాయం అందకుండా అడ్డుకున్నది. అప్పుడు ఎన్నికల కోడ్ సాకు చెప్పి అడ్డుకున్న కాంగ్రెస్ ఇప్పుడు ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ఓటింగ్‌కు కేవలం వారం రోజుల ముందు రైతుబంధు పెట్టుబడి సాయం పంపిణీ చేయడం గమనార్హం. తద్వారా రైతులకు పెట్టుబడి కష్టాలు తెచ్చిన కాంగ్రెస్, తన రాజకీయ ప్రయోజనాలను మాత్రం కాపాడుకుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రైతుబంధు ఆపండి: ఎన్నికల సంఘం ఆదేశం

రైతుబంధు పంపిణీని ఆపేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది. ఎన్నికల కోడ్ నిబంధనలను సీఎం రేవంత్‌రెడ్డి ఉల్లంఘించడం వల్లే రైతుబంధు పంపిణీని నిలిపేసినట్టు పేర్కొంది. వాస్తవానికి ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ రైతుబంధు పంపిణీకి ఈసీ అనుమతిని చ్చింది. అయితే దీనిపై ఎక్కడా ప్రచారం చేసుకోవద్దని షరతు విధించింది. రేవంత్‌రెడ్డి మాత్రం ఈసీ నిబంధనలను ఉల్లంఘించి 8నాటికి రైతుబంధు పూర్తిచేస్తామని బహిరంగంగా ప్రకటించారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు అందడంతో రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఈసీ రైతుబంధు పంపిణీని ఆపేసింది. పోలింగ్ తర్వాతే మళ్లీ ప్రారంభించాలని ఆదేశించింది.

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో వాగేశ్వరి కాలేజీ ఎదుట రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కరెంట్ కట్.. రాత్రి దాకా ఎప్‌సెట్

మొదటిపేజీ తరువాయి...

పడటంతో సిస్టమ్స్ హ్యాంగ్ అయి పరీక్షకు అంతరాయం కలిగింది. పరీక్ష ఆగిపోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు భావించి కాలేజీ వద్ద రోడ్డుపై ధర్నా చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిన సెంటర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరీక్ష 6గంటలకు తిరిగి ప్రారంభించామని, ఆగిపోయిన సమయానికి అదనపు సమయం ఇచ్చి రాయిస్తున్నామని సెంటర్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డి తల్లిదండ్రులకు చెప్పినా వినకుండా దాదాపు గంట సేపు రోడ్డుపై భీష్మించారు. రాత్రి 8 గంటల సమయంలో విద్యార్థులు పరీక్ష రాసి బయటకి రావడంతో ఉత్కంఠకు తెరపడింది. అదేవిధంగా, వరంగల్ జిల్లాలోని మరో పరీక్ష కేంద్రంలో విద్యుత్తు అంతరాయం తలెత్తగా, 15 నిమిషాలు పరీక్షకు అంతరాయం ఏర్పడింది. నల్లగొండలోని మరో పరీక్షాకేంద్రంలో ఉదయం పూట 15 నిమిషాల పాటు పరీక్ష ఆలస్యంగా పూర్తయింది. ఆయా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు నష్టం కలగకుండా పరీక్ష నిలిచిన సమయం నుంచి తిరిగి పరీక్షలను కొనసాగించారు. అంతరాయం తలెత్తిన సమయానికి తగినట్టుగా అదనపు సమయాన్ని కేటాయించడంతో విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు.

తొలిరోజు 90% విద్యార్థుల హాజరు

ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 90శాతానికి పైగా విద్యార్థులు పరీక్ష రాశారు. తెలంగాణ, ఏపీ రెండు రాష్ట్రాల్లో పరీక్షకు ఉదయం సెషన్‌లో 33,500 మందికి 30,288 (90.41శాతం), మధ్యాహ్నం సెషన్‌లో 33,505 మందికి 30,571 (91.24శాతం) విద్యార్థులు హాజరయ్యారు.

కోతల్లేకుండా కరెంటిస్తున్నం

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. పెరిగిన విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా కరెంటును సరఫరా చేస్తున్నట్టు పేర్కొన్నారు. అన్ని క్యాటగిరీల వినియోగదారులకు నిరంతర విద్యుత్తు అందిస్తున్నట్టు వివరించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులాల రిజర్వేషన్లు రద్దు చేయడమే బీజేపీ అసలు ఎజెండా అని, ఇందుకోసం ఆ పార్టీ కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. బీజేపీ పదేండ్ల పాలనలో దేశం అల్లకల్లోలం అయిందన్న ఆయన.. రాజ్యాంగాన్ని మార్చి సెక్యులర్ పదాన్ని తొలగించాలని చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాస్తవాలను ప్రజలకు చెప్పాలని చూసిన సీఎంను భయపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. కాంగెస్ పార్టీని ఇబ్బంది పెట్టాలని బీజేపీ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ వల్ల బలహీనవర్గాలు, దళితులు, గిరిజనులు తమ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. ఓబీసీ కులగణన చేసి జనాభా దామాషా ప్రకారం ఆస్తులు పంచుతామని రాహుల్‌గాంధీ చెప్పారని గుర్తుచేశారు.

బీసీల ఐక్యత చాటాలి

- బీఆర్ఎస్ బీసీ అభ్యర్థులను గెలిపించాలి
- బీసీలకు అత్యధిక సీట్లు ఇచ్చింది బీఆర్ఎస్సే
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన బీసీ అభ్యర్థులందరినీ భారీ మెజార్టీతో గెలిపించి బీసీల ఐక్యతను చాటాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. బీసీలను అవమానపర్చిన వారికి బుద్ధి చెప్పి, లోక్‌సభ ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ 12 జనరల్ సీట్లలో ఆరు సీట్లను బీసీలకు కేటాయించిందని చెప్పారు. చేవెళ్లలో ఇతర పార్టీలు అగ్రవర్ణాలకు అవకాశం ఇచ్చినా బీఆర్ఎస్ బలహీన వర్గాలకు చెందిన కాసాని జ్ఞానేశ్వర్‌ను బరిలో నిలిపిందని అన్నారు. బీసీల కోసం మూడు నాలుగు దశాబ్దాలుగా కాసాని పోరాడారని అన్నారు. కాంగ్రెస్ నేత మోహన్‌రెడ్డి దురహంకారాన్ని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఖండించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బీసీ సంఘాలు ఇప్పటికైనా నిద్ర లేవాలని, జ్ఞానేశ్వర్‌ను గెలుపునకు ప్రయత్నించాలని కోరారు. చేవెళ్లలో కచ్చితంగా గెలుస్తామని, బీసీల దమ్ము చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

పార్టీ మారే ఆలోచనే లేదు

తనకు పార్టీ మారాలనే ఆలోచనే లేదని, పార్టీ మారుతున్నట్టు వస్తున్న వార్తలను ఖండిస్తున్నానని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. తన మనుమరాలి పెళ్లి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని వివరణ ఇచ్చారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, కేసీఆర్‌తోనే పయనిస్తానని స్పష్టం చేశారు.సమావేశంలో బీఆర్ఎస్ నేతలు నాగేందర్ గౌడ్, మల్లేశ్ ముదిరాజ్, పురుషోత్తం, రాందాస్ పాల్గొన్నారు.

ప్రజ్వల్‌ను దేశం దాటిస్తారు.. నాలాంటి వాళ్లను జైల్లో ఉంచుతారా?

- కోర్టు వద్ద ఎమ్మెల్సీ కవిత ఆవేదన
- ఈ నెల 14 వరకు కస్టడీ పొడిగింపు

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): 'లైంగికవేధింపుల కేసులను ఎదుర్కొంటున్న ప్రజ్వల్ రేవణ్ణ వంటి వాళ్లనేమో దేశం దాటిస్తారు. నాలాంటి వాళ్లనేమో అరెస్టు చేశారు' ఇదేం పద్ధతి అంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవితను దర్యాప్తు అధికారులు మంగళవారం రౌస్ ఎవెన్యూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. దర్యాప్తు అధికారుల విజ్ఞప్తిమేరకు కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 14 వరకు పొడిగిస్తున్నట్టు న్యాయస్థానం పేర్కొన్నది. కవిత తనకు పది పుస్తకాలు కావాలని కోరగా న్యాయమూర్తి అనుమతించారు. తనకు ఇంటి నుంచి తీసుకొస్తున్న భోజనాన్ని 10-15 మంది పోలీసులు తనిఖీ చేసిన తర్వాత పంపుతున్నారని, అన్ని తనిఖీల తర్వాత ఆ భోజనం మొత్తం పాడైపోతున్నదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి భోజనానికి సంబంధించిన తుది నిర్ణయంపై జైలు సూపరింటెండెంట్‌ను వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు వెలుపల అక్కడ ఉన్న వారిని ఉద్దేశించి కవిత కొద్దిసేపు మాట్లాడారు. తన అరెస్టు అక్రమం అని అన్నారు.

దాస్యం వినయ్‌భాస్కర్‌తో మాట్లాడుతున్న ఆటోడ్రైవర్ స్వామి

'ఫ్రీ బస్సు'తో మాపొట్ట కొట్టిన్రు

- ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొందపెడుతాం
- దాస్యం వినయ్‌భాస్కర్‌తో ఆటోడ్రైవర్ స్వామి

హనుమకొండ చౌరస్తా, మే 7: ఫ్రీ బస్సు పథకం పెట్టి తమ పొట్టకొట్టిన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో బొందపెడుతామని ఆటోడ్రైవర్ స్వామి పేర్కొన్నాడు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం హనుమకొండ చౌరస్తా మీదుగా వెళ్తుండగా జూనియర్ కాలేజీ సిగ్నల్ వద్ద ఆటోడ్రైవర్ స్వామిని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పలుకరించారు. ఈ సందర్భంగా.. ఆటోడ్రైవర్లకు గిరాకీ వస్తుందా? అని అడుగగా.. ఫ్రీ బస్సు పథకం పెట్టాలని కాంగ్రెస్‌ను ఎవరైనా అడిగారా? వాళ్ల స్వార్థం కోసం పెట్టారని, రేవంత్‌రెడ్డి వచ్చి తమ పొట్ట కొట్టిండని వాపోయాడు. మరి ఆటోడ్రైవర్లు ఎవరికి ఓటు వేస్తారని అడగ్గా.. పక్కాగా బీఆర్ఎస్‌కే ఓటు వేస్తారని సమాధానం ఇచ్చాడు.

మనం కాడి పారేసినమా?

మొదటిపేజీ తరువాయి...

పార్టీవర్గాల సమాచారం. రాష్ట్రంలో తాజా ఎన్నికల పరిస్థితిపై కేసీ వేణుగోపాల్ మంగళవారం పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, అభ్యర్థులు, ఎమ్మెల్యేలతో అత్యవసరంగా జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నేతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది.

అప్పటికీ, ఇప్పటికీ మార్పు రాలేదేం?

మూడు వారాల క్రితం కూడా కేసీ వేణుగోపాల్ ఆకస్మికంగా హైదరాబాద్‌కు వచ్చి పీసీసీ ముఖ్యనేతలు, మంత్రులు, అభ్యర్థులు, రాష్ట్ర ఇన్‌చార్జిలను అప్రమత్తం చేశారు. అధిష్ఠానం ఆశించిన మేరకు రాష్ట్రంలో విజయావకాశాలు ఆశాజనకంగా లేవని అప్పుడే హెచ్చరించి వెళ్లారు. గతానికి, ప్రస్తుత పరిస్థితికి పెద్దగా తేడా ఏమీ కనిపించటం లేదని రాష్ట్ర ముఖ్య నేతలపై మండిపడినట్టు సమాచారం. 'పరిస్థితి మించిపోలేదు. ఇంకా నాలుగు రోజుల వ్యవధి ఉన్నది. ఈ సమయం ఎంతో కీలకం. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఎక్కడికక్కడ కష్టపడి పనిచేస్తే తప్ప పార్టీకి గౌరవప్రదమైన ఎంపీ సీట్లు దక్కటం కష్టమే' అని హెచ్చరించినట్టు తెలిసింది.

మంత్రులు రాజనరసింహ, కోమటిరెడ్డిపై మండిపాటు

సమీక్షలో భాగంగా మంత్రులు దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలపై కేసీ వేణుగోపాల్ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జూమ్ మీటింగ్‌కు రాజనరసింహ గైర్హాజరు కావటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఎన్నికల ప్రచారంలో ఉండటం వల్ల హాజరుకాలేకపోయారని రాష్ట్ర నాయకులు వేణుగోపాల్‌కు చెప్ప